ఎన్నాళ్లీ హైలెవల్ కష్టాలు?


కిన్నెరసాని చప్టా పైనుంచి ఉప్పొంగుతున్న వరద (ఫైల్)

వానాకాలం వచ్చిందంటే రాకపోకలు బంద్

- ప్రతీ ఏటా కిన్నెరసాని వాగు చప్టాపై నుంచి ప్రవాహం
- అత్యవసర పరిస్థితుల్లో చుట్టూ 40 కి.మీ తిరిగిరావాల్సిందే

గుండాల: వానాకాలం వచ్చిందంటే ఆ గ్రామాల రాకపోకలకు ఆగిపోవాల్సిందే. ప్రతీ ఏటా గ్రామాల గిరిజనులు తిప్పలు పడుతూనే ఉంటున్నారు. మండలంలో గుండాల–కొడవటంచ మధ్య కిన్నెరసాని నది, ఏడు మెలికల వాగులు రెండు ఒకే చోట కలుస్తాయి. వర్షాకాలంలో కిన్నెరసాని వాగు ఉధృతితో దాటనీయని పరిస్థితి ఉంటుంది. వాగుపై ఏనాడో నిర్మించిన చప్టా వాగు ఉధృతికి రోజురోజుకు శిథిలావస్థకు చేరింది. దీంతో ఆవతల ఉన్న నాగారం, కొడవటంచ, పాలగూడెం, దొంగతోగు గ్రామాల గిరిజనులు రాకపోకలు నిలిచిపోతాయి. అత్యవసర సమయాల్లో నడిమిగూడెం మీదుగా 40 కి.మీల దాటి గుండాల రావాల్సిన పరిస్థితి. ప్రస్తుతం నడిమిగూడెం వద్ద రోడ్డు కూడా అధ్వానంగా తయారైంది. అక్కడా ఓ చిన్న వాగు ఉన్నప్పటికీ బ్రిడ్జి లేదు. ద్విచక్రవాహనాలు సైతం తిరగవు.

బ్రిడ్జి నిర్మించాలని వేడుకోలు..

కిన్నెరసాని నది, ఏడు మెలికల వాగులు కలిసే చోట హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపడితే తప్పా వారి బాధలు తొలగుతాయని ప్రజలు వేడుకుంటున్నారు. ఇటీవల కాలంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆయా గ్రామాలను సందర్శించగా ఆ సమస్యను ఆయనకు విన్నవించారు. పీఆర్ డీఈని ప్రణాళికలు వేయాలని ఆదేశించారు. అయితే ఏళ్ల తరబడి హై లెవల్ బ్రిడ్జి కావాలని ప్రజాప్రతినిధులకు, జిల్లా అధికారులకు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదని, ఎప్పటికప్పుడు ప్రణాళికలతోనే కాలం వెళ్లదీస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారలు, ప్రజా ప్రతినిధులు స్పందించి వారు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని బ్రిడ్జి నిర్మించాలని కోరుతున్నారు.

రోజుల తరబడి వాగువద్ద పడిగాపులు


ఏడుమెలికల వాగుపై దాటుతున్న గిరిజనులు (ఫైల్)

ప్రతీ ఏటా వానాకాలం వచ్చిందంటే వ్యవసాయ పనుల నిమిత్తం, వైద్యం కోసం మండల కేంద్రానికి రాకపోకలు నిలిచిపోతాయి. ఎరువులు, విత్తనాలు తీసుకురావడంలో జాప్యం ఏర్పడి అదునుపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గర్భిణులు, సీజనల్ వ్యాధులతో వైద్యం కోసం పడరాని పాటు పడుతుంటారు. ఈ వాగులతో ఉపాధ్యాయులు, అధికారులు సైతం ఆయా గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి. వాగు ఉధృతి తగ్గే వరకు ఆయా గ్రామాల ప్రజలు పడిగాపులు పడాల్సిందే. అధికారులు వాగు వద్ద ఎవరినీ దాటనీయకుండా కాపలా ఉంటారు. అత్యవసర సమయాల్లో వాగు ఉధృతి తగ్గుతున్న క్రమంలో కొంతమంది సాహసం చేస్తూ దాటుతుంటారు. ఆ సమయంలో కొట్టుకుపోయే ప్రమాదం లేకపోలేదు.

ఎవరూ పట్టించుకోట్లేదు..



వానాకాలం రాకముందు నుంచే బ్రిడ్జి కోసం జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధుల వెంటపడుతూను ఉన్నాం. కానీ పట్టించుకోవడం లేదు. వాగులు వస్తే ప్రయాణాలు బంద్. ఉపాధ్యాయులు, అధికారులు వచ్చే పరిస్థితి లేదు.

– కొటెం రామస్వామి, కొడవటంచ

పనులన్నీ గుండాలలోనే..



ఎరువులు, విత్తనాలు తెచ్చుకోవాలన్నా, ఆస్పత్రికి వెళ్లాలన్నా, మండల కేంద్రానికి వెళ్లాల్సిందే. వానాకాలం వచ్చిందంటే వాగులు దాటనీయవు. హై లెవల్ బ్రిడ్జి నిర్మించాలి. వాగులపై సాహసం చేస్తూ దాటుతున్నాం, ఎప్పటికైనా ప్రమాదమే.

– ఈసం కోటయ్య, కొడవటంచ

ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం..

కొడవటంచ వద్ద కిన్నెరసాని వాగుపై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ఇటీవల కాలంలో ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకవెళ్లగా నిధులు వచ్చేందుకు కృషి చేస్తానని, ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.

– రామనాథం, పీఆర్ డీఈ

క్లుప్తంగా

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే


వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే జారె

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతోపాటు ఫైనాన్స్ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్ నాయక్‌లను స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ బుధవారం హైదారాబాద్‌లో వేర్వేరుగా కలిశారు. ఈ మేరకు మంత్రికి నియోజకవర్గంలోని ఆలయాలు, ధార్మిక సంస్థ పరిరక్షణతోపాటు అభివృద్ధి, అటవీ శాఖ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలో ఏక పార్క్ ఏర్పాటు చేయాలన్నారు. ఫైనాన్స్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శులను కలిసి నియోజకవర్గంలోని ఆశ్రమ గిరిజన హైస్కూళ్లను ఇంటర్ విద్య స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. ఈ మేరకు వారు స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఆర్థిక సంబంధిత పనులు చేయలేం..


వినతిపత్రాలు అందజేస్తున్న కార్యదర్శులు


కరకగూడెం: పది నెలల నుంచి పంచాయతీలకు ఎలాంటి నిధులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, నిధులు రానంత వరకు ఆర్థిక సంబంధిత పనులు చేయలేమని పంచాయతీ కార్యదర్శులు తేల్చి చెప్పారు. ఈ మేరకు మండలంలోని 16 గ్రామ పంచాయతీల కార్యదర్శులు బుధవారం ఎంపీఓ మారుతీ యాదవ్‌కు వినతిపత్రాలు, పంచాయతీ ట్రాక్టర్ల తాళాలు అందజేశారు. పంచాయతీ కార్యదర్శులు రామకృష్ణ, రాము, విజయ్, శ్రీనాథ్ ఉన్నారు.

40 ఏళ్లుగా చీకట్లోనే మగ్గిపోతున్నాం..


వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మణుగూరు రూరల్ : 40 ఏళ్లుగా సరైన విద్యుత్ సౌకర్యం లేక చీకట్లో మగ్గిపోతున్నామని మండల పరిధిలోని వలస ఆదివాసీ గిరిజన గ్రామమైన రేగులగండి వాసులు వాపోయారు. ఈ మేరకు గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతూ విద్యుత్‌శాఖ ఏడీఈ, ఏఈ ఉమారావుకు బుధవారం గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని కోరారు. గుండి భీమయ్య, గుండి రమేష్, కారం జోగయ్య, మల్లేష్ ఉన్నారు.

రైతులకు సాయం


ఆదివాసీలతో శివనాగస్వామి

దుమ్ముగూడెం : మండలంలోని నర్సాపురం గ్రామం గల శ్రీద్వాదశ జ్యోతిర్లింగ చిన్న అరుణాచలం దేవస్థానం ఆధ్వర్యంలో ఆలయ వ్యవస్థాపకులు శివనాగస్వామి బుధవారం ఏరువాక పౌర్ణమి సందర్భంగా బీద ఆదివాసీ రైతులకు పెట్టుబడి సాయం కింద ఒక్కొక్క కుటుంబానికి రూ.2 వేలు అందజేశారు. అలాగే విద్యాదీవెన కింద ఐదుగురు పేద విద్యార్థులకు రూ.5,000 స్కాలర్‌షిప్ అందజేసినట్టు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ కుటుంబాలను కల్యాణ దాతలుగా ఉంచి శివపార్వతుల కల్యాణం చేయించారు.

పరిశుభ్రత బాధ్యత స్వచ్ఛమిత్రులదే..


దమ్మపేట: మాట్లాడుతున్న ఎంఈఓ లక్ష్మి


అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): మాట్లాడుతున్న ఎంపీడీఓ మహాలక్ష్మి


అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): పాఠశాలల పరిశుభ్రత బాధ్యత స్వచ్ఛమిత్రులదేనని ఎంపీడీఓ కావూరి మహాలక్ష్మి అన్నారు. మండలంలోని ఎర్రగుంట గ్రామంలో ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాలలో పారిశుధ్య కార్మికులకు బుధవారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణి ప్రియాంక, ఎఈఓ ఉండేటి ఆనంద్‌కుమార్, శంకర్ మహాదేవన్, సీసీ నిర్మల, సీఆర్‌పీ శిరీష ఉపాధ్యాయులు ఉన్నారు.


దమ్మపేట: పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంఈఓ కీసర లక్ష్మి సూచించారు. మండలంలోని పట్వారిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛ మిత్రలకు పరిశుభ్రతపై శిక్షణా కార్యక్రమంను నిర్వహించారు. ప్రభుత్వ వైద్యులు దివాకర్, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, ఎంఆర్పీలు రవి, శ్రీలత, స్వచ్ఛ మిత్రలు పాల్గొన్నారు.

కరకగూడెం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి 'స్వచ్ఛ మిత్ర'లకు శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. కోర్సు డైరెక్టర్, ఎంఈఓ మంజుల అధ్యక్షతన మండలంలోని స్వచ్ఛ మిత్రలకు శిక్షణ ఇచ్చారు. మండల రిసోర్స్ పర్సన్లు వెంకటేశ్వర్లు, బాషింగ్, సూర్యనారాయణ, ఎంఆర్పీలు జయబాబు, విష్ణుమూర్తి తదితరులు ఉన్నారు.

అశ్వాపురం: మండల పరిధిలోని మిట్టగూడెం జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో స్వచ్ఛమిత్రులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ వీరస్వామి పలు అంశాలపై సలహాలు, సూచనలు ఇచ్చారు. ఎంఆర్పీ రాంబాబు తదితరులు ఉన్నారు.

దుమ్ముగూడెం: మండల విద్యావనరుల కేంద్రంలో స్వచ్ఛమిత్రులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఎంఈఓ సున్నం సమ్మయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం ఏవీ.రామారావు, పర్ణశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ప్రభాకర్, రిసోర్స్ పర్సన్స్ మోహన్‌కుమార్, స్వరూప, ప్రసాద్ ఉన్నారు.


దుమ్ముగూడెం: మాట్లాడుతున్న ఎంఈఓ సమ్మయ్య


కరకగూడెం: మాట్లాడుతున్న ఎంఈఓ మంజుల

16న ఉచిత కంటి పరీక్ష శిబిరం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగలకు ఈ నెల 16న ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు గుడివాడ భూషన్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించే ఈ శిబిరానికి హైదరాబాద్‌కు చెందిన మెడీవిజన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసి అవసరమైన వారిని హైదరాబాద్ తరలించి కంటి శస్త్ర చికిత్సలు చేస్తారని పేర్కొన్నారు. ఈహెచ్ఎస్ కార్డు ఉన్న ప్రతీ ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నిర్మాణాలపై దృష్టి పెట్టాలి


మాట్లాడుతున్న ఏఈ మదన్‌కుమార్

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని హౌసింగ్ ఏఈ మదన్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారులకు మంజూరు చేసిన ఇళ్లకు ఆలస్యం చేయకుండా మార్కింగ్‌లు ఇవ్వాలని, అలాగే ఇళ్ల నిర్మాణాలకు కావాల్సిన ఇసుక కోసం కూపన్లు జారీ చేయాలన్నారు. ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ముంపునకు గురికాకుండా చర్యలు

- ఎమ్మెల్యే పాయం


పూడిక పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయం

మణుగూరు టౌన్: మణుగూరు పట్టణం ఇకపై ముంపునకు గురికాకుండా పూర్తి స్థాయి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు ఆదర్శనగర్‌లోని కట్టువాగు పూడికతీత పనులను బుధవారం పరిశీలించారు.

ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలి..

ప్రతీ చిన్నారి ప్రభుత్వ పాఠశాలలో చేరే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని తల్లిదండ్రులు దృష్టి సారించాలని ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు మున్సిపాలిటీలోని గాంధీబొమ్మసెంటర్ బాలికల పాఠశాలలో నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పలు సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా పరిష్కారానికి అధికారులను ఆదేశించారు.

భూ భారతితో సమస్యలు పరిష్కారం..

గత ప్రభుత్వం ధరణి పేరుతో ఎన్నో అవకతవకలకు పాల్పడిందని ఆ సమస్యలకు భూ భారతి పరిష్కారం చూపుతుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన భూ భారతి రెవెన్యూ సదస్సుకు ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. భూ భారతి చట్టం రైతులందరికీ మేలు చేస్తుందన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన..

మండలంలోని ముత్యాలమ్మనగర్, తోగ్గూడెం పంచాయతీల్లోని శాంతినగర్, తోగ్గూడెం గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శంకుస్థాపన చేశారు. వేగంగా నిర్మాణాలు పూర్తి చేసుకుని నాలుగు దఫాలుగా వచ్చే నిధులను సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ అద్దంకి నరేశ్, ఎంపీడీఓ తెల్లూరి శ్రీనివాసరావు, ఎంఈఓ స్వర్ణజ్యోతి, నాయకులు నవీన్, శివ, బాబు, గోరంట్ల కనకన్న తదితరులు పాల్గొన్నారు.

మావోలను కాదు పేదరికాన్ని అంతం చేయండి


మాట్లాడుతున్న సాబీర్‌పాషా

ములకలపల్లి: 2026 మార్చిలోగా మావోయిస్టులను అంతం చేస్తామని ప్రకటిస్తున్న కేంద్ర ప్రభుత్వం, నరమేధాన్ని తక్షణమే ఆపేసి, పేదరికాన్ని అంతం చేసే దిశగా ముందుకు సాగాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే.సాబీర్‌పాషా అన్నారు. మండలకేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన పార్టీ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. ఆపరేషన్ కగార్ పేరిట మావోలను పిట్టల్లా కాల్చుతున్నారని, ఇకనైనా పరస్పర చర్చలు జరిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీతారామ ప్రాజెక్ట్ గోదావరి జలాలు జిల్లా సాగుభూములకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ నిర్మాణాలు పూర్తి చేయాలని, శిథిలావస్థకు చేరిన మూకమామిడి ప్రాజెక్టుకు తక్షణమే మరమ్మతులు చేపట్టి, సీతారామ కాల్వకు అనుసంధానం చేయాలన్నారు. మండలంలోని గుట్టగూడెం సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన 'పోడు' పోరు జిల్లాకు స్ఫూర్తినిచ్చిందని కొనియాడారు. భూక్యా దేవ్‌సింగ్ అధ్యక్షతన మూకమామిడి తండాకు చెందిన 40 కుటుంబాలు పార్టీలో చేరాయి. ఈ కార్యక్రమంలో ఎస్కే.జబ్బార్, నరాటి ప్రసాద్, కొర్రి భద్రం, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు, నరాటి ప్రసాద్, డివిజన్ కార్యదర్శి సలీం, మండల కార్యదర్శి ఎండీ. యూసఫ్, నరాటి రమేశ్, వర్కా అజిత్, పద్మావతి, నిమ్మల రాంబాబు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరిస్తాం..

పినపాక: ఎన్నో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న రైతు సమస్యలను పరిష్కరించడానికి భూభారతి ఎంతో ఉపయోగపడుతుందని తహసీల్దార్ గోపాలకృష్ణ అన్నారు. ఈ మేరకు బుధవారం సీతారాంపురం పంచాయతీలో భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. అర్హత పొందిన ప్రతీ రైతుకు పాస్ పుస్తకాల అందజేస్తామన్నారు.

అశ్వాపురం: మండలపరిధిలోని ఆనందాపురం, గొందిగూడెం, గొందిగూడెం కొత్తూరు పంచాయతీల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రైతులు భూ సమస్యలపై దరఖాస్తులు అందజేశారు. తహసీల్దార్ రాజారావు, ఆర్ఐ లావణ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: మండలంలోని కొత్త మామిళ్లవారిగూడెం, నారాయణపురం గ్రామ పంచాయతీల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ హుస్సేన్‌కు బాధిత రైతులంతా కలిసి వినతిపత్రాన్ని అందించారు. సొసైటీ చైర్మన్ నిర్మల పుల్లారావు, ఆర్ఐలు కృష్ణ, పద్మావతి, సిబ్బంది రమేష్, చైతన్య, వెంకన్న, రైతులు చందా కుమారస్వామి, జక్కుల రాంబాబు, ఇంటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కరకగూడెం: భూ భారతితో రెవెన్యూ సేవలు ప్రజలకు మరింత చేరువకానున్నాయని తహసీల్దార్ వట్టం కాంతయ్య ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు కరకగూడెం జీపీ కార్యాలయంలో నిర్వహించి రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు స్వీకరించారు. ఆర్ఐ కృష్ణ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా అమ్మమాట–అంగన్‌వాడీ బాట

అంగన్‌వాడీ కేంద్రానికి ఐదేళ్లలోపు చిన్నారులను పంపించాలని కోరుతూ అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమ్మమాట– అంగన్‌వాడీ బాట కార్యక్రమం ముమ్మరంగా సాగుతుంది. ఈ సందర్భంగా గ్రామాల్లో పిల్లలను గుర్తించి ర్యాలీలు ప్రచారం నిర్వహించారు. అంగన్‌వాడీల్లో అన్ని రకాల వసతులతో పాటు పౌష్టికాహారం లభిస్తుందని సిబ్బంది అన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


గుండాలలో..


మణుగూరు రూరల్: చిన్నారులకు స్వాగతం పలుకుతున్న దృశ్యం


పినపాకలో..


దమ్మపేటలో..


అశ్వాపురంలో..


అశ్వారావుపేటరూరల్: కోతమిషన్ బజార్‌లో..

పునఃప్రారంభానికి సంసిద్ధం..


చిరుమళ్ల ఆశ్రమ పాఠశాల ఆవరణలో శుభ్రం చేస్తున్న సిబ్బంది

కరకగూడెం: వేసవి సెలవుల అనంతరం నేటి నుండి ప్రభుత్వ పాఠశాలలు తిరిగి పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో పాఠశాలలను సిద్ధం చేశారు. ఈ మేరకు బుధవారం ఉదయం నుంచే పాఠశాలల ప్రాంగణాన్ని, తరగతి గదులను, మరుగుదొడ్లను పూర్తిగా శుభ్రం చేసి పాఠశాలలను సిద్ధం చేశారు. చీలను సరిచేయడం వంటి పనులు చేపట్టారు. పరిసర ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి మొక్కలకు నీరు పోసి, పాఠశాల ప్రాంగణాన్ని మరింత అందంగా తీర్చిదిద్దారు. ఎంఈఓ గడ్డం మంజుల మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠశాలకు రాగానే వారికి పరిశుభ్రమైన వాతావరణం కనిపించాలని, అది వారిలో ఉత్సాహాన్ని నింపుతుందని ఉపాధ్యాయులకు సూచించారు.

సంక్షిప్తంగా..

జీపీఎఫ్ అమలు చేయాలని వినతి

మణుగూరు రూరల్: విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు జీపీఎఫ్ అమలు చేయాలని తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ (టీజీపీఈ) జేఏసీ బీటీపీఎస్ ఆధ్వర్యంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు బుధవారం క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కన్వీనర్ ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బి.రవిప్రసాద్‌లు జీపీఎఫ్ అమలు చేయకపోవడం వల్ల విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. అనంతరం ఎమ్మెల్యేను జేఏసీ నాయకులు సన్మానించారు. ప్రసాద్, హేమ్లా, కృష్ణ, రామచందర్, రవికుమార్, వెంకటకృష్ణ, రమణ, వెంకటేషన్, సాయిరాం పాల్గొన్నారు.

ఆదివాసీలపై హత్యా రాజకీయాలు తగవు

దుమ్ముగూడెం: ఆదివాసీలపై హత్యా రాజకీయాలు తగవని ఆదివాసీ సంఘాల ఐక్య కార్యాచరణ వేదిక ఆధ్వర్యంలో ఖండించారు. మండలంలోని నడికుడి గ్రామంలో బుధవారం వేదిక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ... ఇలాంటి విష సంస్కృతిని ప్రోత్సహిస్తున్న వారు ఎంతటి వారైనా సరే కఠిన శిక్ష పడేలా పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గౌరవ అధ్యక్షులు కొమరం దామోదర రావు, కుంజా శ్రీనివాసరావు, కార్యదర్శి కణితిరాముడు, కోడిచంటి తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌దుకాణం తనిఖీ

మణుగూరు రూరల్: మండలంలోని సంతోష్‌నగర్‌లో గల రేషన్‌దుకాణాన్ని మణుగూరు తహసీల్దార్ అద్దంకి నరేష్ బుధవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా దుకాణంలో బియ్యం నిల్వలను పరిశీలించి స్టాక్ వివరాలను సంబంధిత డీలర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రేషన్ రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ గోపి తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో గల బక్కచింతలపాడు గ్రామంలో డాక్టర్ రేణుకారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా టీకాలు పంపిణీ చేసి, పలు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వైద్య సిబ్బంది వెంకట నర్సమ్మ, నాగేశ్వరరావు, సావిత్రి, పార్వతి, శిరీష, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో అడ్మిషన్లు

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలోని రేగుబల్లి బాలికల ఆశ్రమ పాఠశాల–1లో చేరుటకు అడ్మిషన్లు ఉన్నాయని హెచ్‌ఎం సావిత్రి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు సీట్లు ఖాళీలు ఉన్నాయని, చేరదలిచే విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కరకగూడెం: రెండు ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని పద్మాపురం గ్రామానికి చెందిన గోగ్గలి రాజు బుధవారం ద్విచక్రవాహనంపై తన కుమార్తెను మణుగూరులోని కాలేజీలో చేర్పించి తిరిగి వస్తున్నాడు. ఇదే సమయాన కరకగూడెం నుండి పినపాక మండలంలోని గోవిందాపురానికి బైక్‌పై వెళ్తున్న రాంబాబు రాళ్లవాగు మలుపు వద్ద ఎదురెదురుగా ఢీ కొన్నారు. ఈ ఘటనలో రాజు, రాంబాబుకు గాయాలు కాగా 108లో మణుగూరు ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వైద్యులను నియమించాలి

బూర్గంపాడు: బూర్గంపాడు సీహెచ్‌సీలో నిపుణులైన వైద్యులను నియమించాలని సీపీఐ(ఎంఎల్) నాయకులు పున్నంచంద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో ఎంబీబీఎస్ డాక్టర్లు లేకపోవడం దారుణమని, ఇప్పటికైనా వైద్యులను నియమించి రోగులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

కరకగూడెం: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని కరకగూడెం ఎస్సై పీవీఎన్ రావు సూచించారు. ఈ మేరకు ఆయన బుధవారం రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు, ట్రాఫిక్ నిబంధనల పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు మండలంలోని పలు చోట్ల ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేపట్టారు.

వసతిగృహాల్లో దోమల మందు పిచికారీ

మణుగూరు రూరల్: మండలంలోని అశోక్‌నగర్, సమితిసింగారం వసతిగృహాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం దోమల మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ నిశాంత్‌రావు మాట్లాడుతూ.. ముందస్తు చర్యల్లో భాగంగా వసతి గృహాల్లో దోమల మందు పిచికారి చేసినట్లు తెలిపారు. అనంతరం గుండుసింగారంలో నిర్వహిస్తున్న వ్యాక్సినేషన్‌ను పరిశీలించారు. ఎస్‌యుఓ వీరస్వామి, వైద్యసిబ్బంది రాంప్రసాద్, కృష్ణ, వార్డెన్లు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరండి

అశ్వారావుపేటరూరల్: పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అశ్వారావుపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరాలని కళాశాల ప్రిన్సిపాల్ అల్లు అనిత కోరారు. బుధవారం అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక భద్రాచలం రోడ్డు, సత్తుపల్లి రోడ్డుతోపాటు పలు ప్రాంతాల్లో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డీఎస్ నరసింహారావు, ఎస్కే.చాంద్‌పాషా, ఎల్ఎస్ ప్రసాద్, డేగల నరసింహారావు పాల్గొన్నారు.